సాక్షి మహబూబ్‌నగర్

సోమవారం, 17, ఏప్రిల్, 2023



సిబ్బంది లేక ఇబ్బంది..

రాష్ట్రంలోనే పేరుమోసిన బాదేపల్లి మార్కెట్‌లో సిబ్బంది లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

వివరాలు 8లో ▸



దివ్యాంగులకు భరోసా

దివ్యాంగులకు సబ్సిడీపై ఉపకరణాలు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
39.5 /26.9

వాతావరణం

రోజంతా ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది. సాయంత్రం ఆకాశం తేలికపాటి మేఘావృతమవుతుంది.



ఇఫ్తార్ 6-40
(సోమవారం సాయంత్రం)

సహర్ 4-36
(మంగళవారం తెల్లవారుజామున)

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 6, 7, 8, 9వ తరగతుల్లో చేరేందుకు ఆదివారం జిల్లావ్యాప్తంగా 11 కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. మొత్తం 5,421 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 4,830 మంది (89 శాతం) హాజరయ్యారు. కాగా, జడ్చర్లలోని టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్–జేసీ (బాలికల) కేంద్రాన్ని గురుకులాల ప్రాంతీయ సమన్వయ అధికారి ఫ్లోరెన్స్‌రాణి, దేవరకద్రలోని టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్- జేసీ (బాలుర) కేంద్రాన్ని పరిశీలకురాలు దేవసేన తనిఖీ చేశారు. అనంతరం జిల్లా సమన్వయ అధికారి వాణిశ్రీ మాట్లాడుతూ ఆయా గురుకులాల్లోని ఖాళీ సీట్లను విద్యార్థుల మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తామన్నారు.

21న పాలమూరులో నిరుద్యోగ మిలియన్ మార్చ్



పాలమూరు: జిల్లాలో ఈ నెల 21న బీజేపీ నిరుద్యోగ మిలియన్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి తెలిపారు. ఆదివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ వ్యవహారాన్ని నిరసిస్తూ జిల్లాకేంద్రంలోని టీడీడీ కల్యాణ మండపం ఎదుట మధ్యాహ్నం 3 గంటల నుంచి 8 గంటల వరకు మిలియన్ మార్చ్ కొనసాగుతుందని, ఆ తర్వాత క్లాక్‌టవర్ వరకు ర్యాలీగా వెళ్లి నిరసన వ్యక్తం చేస్తామన్నారు. కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు. నిరుద్యోగుల సమస్యలపై బీజేపీ చేస్తున్న పోరాటానికి నిరుద్యోగులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకులకు కారణమైన మంత్రి కేటీఆర్ తన పదవికి రాజీనామా చేయాలని, పరీక్ష రాసిన ఒక్కో అభ్యర్థికి రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలని, అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఎన్‌పీ వెంకటేష్, శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, నారాయణయాదవ్, సుబ్రహ్మణ్యం, కుమార్ పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానం సాధించేదాక పోరాటం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పాత పెన్షన్ విధానాన్ని సాధించే దాక పోరాటం చేస్తామని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలస్వామి అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి అంబేడ్కర్ చౌరస్తా దాక ర్యాలీ నిర్వహించి అక్కడి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగుల రూ.వందల కోట్లు ఎక్కడికి పోయావో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దగ్గర లెక్కలు లేవన్నారు. రిటైర్డ్ అయిన తర్వాత సీపీఎస్ ఉద్యోగులకు హెల్త్ కార్డులు పనిచేయవని, సీపీఎస్ ఉద్యోగులకు బేసిక్ నుంచి ఒక్కో శాతం కట్ చేయవద్దని డిమాండ్ చేశారు. లోపభూయిష్టమైన సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ పథకాలు అమలు చేయడంలో కీలక పాత్ర పోషించే ఉద్యోగులకు పెన్షన్ లేకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి చంద్రకాంత్, నాయకులు మున్ని, విజయ్‌కుమార్, గోవర్దనచారి, వెంకటయ్యగౌడ్, రాఘవేందర్‌రెడ్డి, ఆంజనేయులు, శ్రీధర్, రాఘవేందర్, కొండల్‌రావు, నరేష్, సుధీర్, వెంకటేష్, రాజేష్, మల్లేష్, పాండుగౌడ్, ఖాదర్, కుర్మయ్య, శ్వేతశ్రీ, రాధిక, గౌరమ్మ, నర్మద, గీత తదితరులు పాల్గొన్నారు.



డెడ్ స్టోరేజ్

జూరాల జలాశయంలో అడుగంటిన నీటిమట్టం

- ప్రస్తుతం 3.689 టీఎంసీలు.. లైవ్‌స్టోరేజీ నిల్
- వేసవిలో 1.20 టీఎంసీల తాగునీరు అవసరం
- కుడి, ఎడమ ప్రధాన కాల్వలకు సాగునీటి నిలిపివేత
- ప్రశ్నార్థకంగా 50 వేల ఎకరాల వరిపంట



జూరాల జలాశయంలో ప్రస్తుత నీటిమట్టం

గద్వాల రూరల్: ఉమ్మడి పాలమూరుకు మరో మారు నీటిగండం ఎదురుకానుందా.. వేసవిలో తాగునీటి కోసం జనం అల్లాడే పరిస్థితులు నెలకొననున్నాయా.. అంటే జూరాలలో నీటినిల్వను చూస్తే అవుననే అనిపిస్తోంది. ఇప్పటికే ప్రాజెక్టు అధికారులు జూరాలలో ప్రస్తుతం నీటినిల్వ పరిస్థితిని పేర్కొంటూ వేసవిలో తాగునీటి అవసరాలకు ఇబ్బందులు తలెత్తవచ్చనే హెచ్చరికలు సైతం ప్రభుత్వానికి నివేదించారు. దీంతో జలాశయంలో నీటిని కేవలం తాగునీటికి మాత్రమే వినియోగించాలని.. సాగునీటి విడుదలను తక్షణమే నిలిపేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో.. జూరాలలోని ఎడమ, కుడి ప్రధాన కాల్వలతోపాటు సమాంతర కాల్వకు సైతం నీటిని పూర్తిగా నిలిపివేశారు. అయితే ఇప్పటికే జూరాల కింద సాగుచేసిన 50 వేల ఎకరాల వరిపంట ప్రశ్నార్థకంగా మారగా.. మరోవైపు తాగునీటి గండాన్ని అధిగమించేందుకు మిషన్ భగీరథ అధికారులు తంటాలు పడుతున్నారు.

ఆందోళనలో చివరి ఆయకట్టుదారులు

జూరాల ఎడమ, కుడి కాల్వల పరిధిలోని చివరి ఆయకట్టుదారులు సాగునీటి నిలుపుదలతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎడమ కాల్వ పరిధిలో అమరచింత, ఆత్మకూరు, మదనాపురం, కొత్తకోట, పెబ్బేరు, శ్రీరంగాపురం, చిన్నంబావి, వీపనగండ్ల, గోపల్‌దిన్నె ప్రాంతాల్లో సుమారు 85 వేల ఎకరాలు సాగు చేయగా.. కుడి ప్రధాన కాల్వ పరిధిలో ధరూరు, గద్వాల, ఇటిక్యాల మండలాల పరిధిలో సుమారు 25 వేల ఎకరాల వరకు వరిపంట సాగుచేశారు. ప్రస్తుతం ప్రధాన కాల్వల పైభాగంలో సాగుచేసిన పంటలకు ఒక తడికి నీటిని విడుదల చేస్తే పంటలు చేతికొస్తాయని చెబుతుండగా.. మరోవైపు ఆలస్యంగా సాగుచేసిన రైతులు మాత్రం మరో రెండు, మూడు తడులు విడుదల చేయాలని కోరుతున్నారు. అలాగే ఎడమ కాల్వ పరిధిలోని అమరచింత, కురుమూర్తిరాయ, రంగసముద్రం లిఫ్టు పరిధిలో 18 వేల ఎకరాలు, కొత్తకోట, పెబ్బేరు, శ్రీరంగాపురం, చిన్నంబావి, వీపనగండ్ల పరిధిలో మరో 30 వేల ఎకరాలు, కుడి ప్రధాన కాల్వ పరిధిలోని ఇటిక్యాల మండలంలో మరో 10 వేల ఎకరాలకు రెండు నుంచి మూడు తడుల నీరు అవసరముందని చెబుతున్నారు. దీంతో సుమారు 50 వేల ఎకరాలు సాగుచేసిన వరిపంటలు ప్రశ్నార్థకంగా మారాయి.

వందరోజుల పాటు..



ఎడమ వైపు వట్టిపోయిన జూరాల జలాశయం

ఇదిలా ఉండగా మరోవైపు వర్షాకాలం అంటే సుమారు వందరోజుల వరకు జోగుళాంబ గద్వాల, నారాయణపేట, వనపర్తి, నాగర కర్నూల్ జిల్లాలు తాగునీటి కోసం జూరాల జలాశయం మీదనే ఆధారపడ్డాయి. ఈ వంద రోజుల్లో ఎండలకు ఆవిరి రూపంలో వెళ్లే నీటిని కలుపుకొని తాగునీటి అవసరాలకు సుమారు 1.50 టీఎంసీలు అవసరమని మిషన్ భగీరథ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ప్రస్తుతం జూరాల జలాశయం డెడ్‌స్టోరేజీతో కలుపుకొని 3.982 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉంది. ఇందులో తాగునీటికి అవసరమైన ఎంటీఎండీడీఎల్ కింద 1.026 టీంఎసీలు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. మరి ఈ నీటితో మరో వందరోజుల పాటు ఎలా నెట్టుకొస్తారో.. తాగునీటి గండాన్ని ఎలా గట్టెక్కిస్తారో.. వేచి చూడాలి.

మరోసారి కర్ణాటకపైనే..

జూరాలలో అందుబాటులో ఉన్న నీటి నిల్వను పరిశీలిస్తే మరోసారి 2019 నాటి పరిస్థితులు తలెత్తనున్నాయా.. అన్న అనుమానం కలుగుతుంది. 2019లో తాగునీటి అవసరాల కోసం కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి నుంచి 3 టీఎంసీలను విడుదల చేయాలని కోరగా.. సానుకూలంగా స్పందించి 3 టీఎంసీలు విడుదల చేయగా మనకు చేరింది 1.70 టీఎంసీలే. ఈసారి కూడా కర్ణాటకపై ఆధారపడతామేమో అని ఓ అధికారి చెబుతుండడం క్షేత్రస్థాయి పరిస్థితికి అద్దం పడుతుంది.

ఇబ్బంది లేకుండా..

జిల్లావ్యాప్తంగా ఏడాది పొడవునా మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని సరఫరా చేయాలంటే 1.25 టీఎంసీల నీరు అవసరం. అయితే వర్షాకాలం, చలికాలంతో పోల్చితే వేసవిలో తాగునీటికి డిమాండు ఎక్కువ. పైగా ఎండలకు ఆవిరి రూపంలో సుమారు 0.50 టీఎంసీల నీరు పోతుంది. అలాగే తాగునీటి కోసం మరో 0.36 టీఎంసీలు అవసరం. దీనిని దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న నీటిని పొదుపు చేసుకుని వందరోజులపాటు జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– భీమేశ్వర్, ఈఈ మిషన్ భగీరథ గ్రిడ్, గద్వాల


రెండు తడులకు నీరు..



నేను 14 ఎకరాల్లో వరి పంట సాగుచేశారు. ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉంది. పాలు పోసి గింజ బాగా రావాలంటే ఇంకా రెండు తడుల నీరు అవసరం. ఇప్పటికే తెగులు సోకడంతో దిగుబడి కూడా తగ్గే ప్రమాదం ఉంది. అధికారులు సానుకూలంగా స్పందించి పంటకు నీరు విడుదల చేయాలి.

– దేవదాసు, రైతు, మూలమల్ల, ఆత్మకూరు మండలం

మే నెల మొదటి వారం..



నేను మూడెకరాల్లో వరిపంట వేశాను. పంటచేతికి రావాలంటే మే మొదటి వారం వరకు నీరు వదలాలి. ఇప్పటికే అధికారులు నీటి విడుదల బంద్ చేయడంతో కాల్వలు వట్టిపోతున్నాయి. కాబట్టి మే నెల మొదటి వారం వరకు నీటిని విడుదల చేసి మా పంటలు కాపాడాలి.

– శివయ్య, రైతు, రేవులపల్లి, ధరూర్ మండలం

తాగునీటికే ప్రాధాన్యం..

ప్రస్తుతం జూరాల ఎడమ కాల్వ పరిధిలో సాగు చేసిన పంటలకు మార్చి 31 నాటికే నీటిని అందించాలని అధికారికంగా నిర్ణయించాం. అయితే రైతుల డిమాండ్ మేరకు మరో పదిరోజులపాటు నీటిని విడుదల చేశాం. ప్రస్తుతం ప్రాజెక్టులో నిల్వ దృష్ట్యా తాగునీటి అవసరాలకు మాత్రమే విడుదల చేయాలని నిర్ణయించాం. మా పరిధిలోని కాల్వకు నీటిని నిలిపివేశాం.

– జగన్‌మోహన్, ఈఈ జూరాల ఎడమ కాల్వ

ఊరూరా అంబేడ్కర్ సందేశ్ యాత్ర

మహబూబ్‌నగర్ రూరల్: భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి, దళితుల్లో సామాజిక చైతన్యం అవగాహన కల్పించడానికి పూలే- అంబేడ్కర్ సందేశ్ యాత్రలకు కేవీపీఎస్ ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టామని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుర్మయ్య అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి బైక్ యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఈ యాత్రలో పట్టణ అధ్యక్షుడు సత్యం, కార్యదర్శి ఆది విష్ణువర్ధన్ నాయకత్వంలో మహబూబ్‌నగర్, భూత్పూర్ మండలాల్లోని గ్రామాల్లో కొనసాగుతుందని చెప్పారు. మనువాదాన్ని మట్టుబెట్టేందుకు, రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు యువత నడుంబిగించాలన్నారు. రిజర్వేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాల్సిన అవసరం, ప్రాధాన్యతను గ్రామాల్లో యువతకు వివరిస్తామని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగంలోని సూత్రాలను విస్మరిస్తుందని మండిపడ్డారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు మాణిక్యంరాజు మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళిత, గిరిజన, మైనారిటీలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు భరత్, కార్యదర్శి ప్రశాంత్, నాయకులు వేణు, శ్రీను, జహంగీర్, సాయిబాబా, శేఖర్, కృష్ణ, నందు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతోనే అగ్నిప్రమాదాల నివారణ

మహబూబ్‌నగర్ క్రైం: అప్రమత్తతోనే అగ్నిప్రమాదాలను నివారించవచ్చని మహబూబ్‌నగర్ ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ పద్మయ్య అన్నారు. సాధారణంగా మహిళలు వంట చేస్తున్న సమయంలో వంటగది విడిచిపెట్టి బయటకు వెళ్లరాదని, అలాంటి సమయాల్లోనే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని చెప్పారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లాకేంద్రంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఇళ్లలో జరిగే అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. గ్యాస్ స్టౌలో, సిలిండర్, రెగ్యులేటర్‌లో ఏదైనా సమస్య వస్తే సొంతంగా మరమ్మతు చేయరాదని, గ్యాస్ డీలర్‌ను సంప్రదించాలన్నారు. ట్యూబ్ లాగి చూసినప్పుడు ఏమాత్రం పొడి రాలిన, చీలిక కనబడినా వెంటనే కొత్త ఐఎస్‌ఐ మార్కు గల రబ్బర్ ట్యూబ్ మార్చుకోవాలని సూచించారు. ప్రతిరోజు రాత్రివేళలో తప్పకుండా రెగ్యులేటర్ ఆఫ్ చేయాలని, వంట గదిలో రిఫ్రిజిరేటర్ పెట్టరాదన్నారు. గ్యాస్ లీకవుతున్న సమయంలో టెన్షన్ పడకుండా, వెంటనే రెగ్యులేటర్ వాల్వ్ ఆపి వేయాలని, ఎలక్ట్రికల్ స్విచ్‌లు ఆన్, ఆఫ్ చేయరాదన్నారు. ప్రమాదం జరిగితే అవకాశం ఉంటే రెగ్యులేటర్ వాల్వ్ ఆఫ్ చేయడం లేకపోతే తడిపిన గోనె సంచిని మండుతున్న సిలిండర్‌పై వేయాలన్నారు.

బీసీలకు ఆత్మగౌరవ భవనాలు



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, గతంలో ఎప్పుడూ లేని విధంగా బీసీ కులాలన్నింటికీ ఆత్మగౌరవ భవనాలు నిర్మించేందుకు రూ.కోట్ల విలువైన స్థలాలు, నిధులు కేటాయించామని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలో జరిగిన దేవాంగ కుల సంఘం ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేవాంగ ఆత్మగౌరవ భవనం కోసం ప్రభుత్వం రాజధానిలో రూ.40 కోట్ల విలువైన స్థలం రూ.75 లక్షల నిధులు కేటాయించినందన్నారు. జిల్లాకేంద్రంలో సైతం దివ్యాంగ భవనం నిర్మాణం కోసం స్థలం, నిధులు కేటాయిస్తామన్నారు. ఒకప్పుడు బీసీలంతా ఒకే కులంగా ఉండేవారని క్రమంగా వివిధ వృత్తులుగా విడిపోయారని, ఆ వృత్తేలే నేడు కులాలుగా మారి పోయాయన్నారు.

రజకుల అభివృద్ధికి కృషి

రజకుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. స్థానిక బీఆర్‌ఎస్ కార్యాలయంలో నిర్వహించిన రజక యువజన క్రాంతి సంఘం ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరై మాట్లాడారు. భూస్వాముల మీద మొదటి ఎదురు తిరిగి పోరాటం చేసిన ధీశాలి చాకలి ఐలమ్మ అన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ దోబీ ఘాట్లకు బదులుగా పెద్ద వాషింగ్ మిషన్లను అందజేశారన్నారు. రజకులకు ఉచిత కరెంట్ ద్వారా అండగా నిలిచామన్నారు. ఆయా కార్యక్రమాల్లో ముడా చైర్మన్ వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్, కౌన్సిలర్లు కిషోర్, నాయకులు నవకాంత్ పాల్గొన్నారు.

వనపర్తిలో బహుజన జెండా

పెబ్బేరు/ పెబ్బేరు రూరల్/ ఎర్రవల్లి చౌరస్తా: రాబోయే రోజుల్లో వనపర్తిలో బహుజన జెండా ఎగరడం ఖాయమని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం పెబ్బేరులో బహుజన రాజ్యాధికార యాత్ర, రోడ్ షో, బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఏకమై ఏనుగు గుర్తుకు ఓటేయ్యాలని.. తద్వారా బహుజన రాజ్యాధికారం వచ్చి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం శ్రీరంగాపూర్‌లో అంబేడ్కర్ యువజన సంఘం వ్యవస్థాపకులు వేవని చంద్రయ్య జ్ఞాపకంగా నిర్మించుకున్న గ్రంథాలయం, బీఆర్ అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బహుజనులను ఏకం చేసి రాజ్యాధికారం సాధించే వరకు పోరాటం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా విఫలమయ్యారని విమర్శించారు. నిత్యావసరాలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్, మద్యం ధరలు పెంచి, వైద్యం, విద్యను కార్పొరేటర్లకు అప్పజెప్పే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆయా కార్యక్రమాల్లో వనపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెన్నరాములు, నాయకులు బాలస్వామి, కృష్ణయ్య, ఎల్లస్వామి, మద్దిలేటి, కురుమూర్తి, నారాయణ, గట్టన్న, రాంబాబు, వెంకటేష్, సురేష్, కుర్మన్న తదితరులు పాల్గొన్నారు.



పెబ్బేరులో మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

పార్టీని బలోపేతం చేయాలి

అలంపూర్ నియోజకవర్గంలో బీఎస్పీని బలోపేతం చేసేందుకు కలిసి పనిచేయాలని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో జిల్లా ఇన్‌చార్జ్ ఎంజీ కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన హాజరై దిశానిర్దేశం చేశారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో నీలిరంగు జెండా ఎగిరేలా ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోరారు.

నిధుల మంజూరుకే సరి

ఆరు నెలల క్రితం రూ.100 కోట్లు కేటాయింపు

- లోతట్టు ప్రాంతాల్లో తిష్టవేసిన సమస్యలు
- గతేడాది వరదలతో గుణపాఠం నేర్వని మున్సిపల్ యంత్రాంగం
- అభివృద్ధి పనులు చేపట్టడంలో తీవ్ర నిర్లక్ష్యం
- పాలమూరువాసులకు తప్పని ఇబ్బందులు



వార్డు నం.9 పరిధిలోని భాగ్యనగర్‌కాలనీలో బీటీకి నోచుకోని రోడ్డు



వార్డు నం.7 పరిధిలోని కృష్ణా టెంపుల్ గుట్ట కింద ప్రాంతంలో మురుగుకాల్వ దుస్థితి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: గతేడాది వర్షాకాలంలో వరద తాకిడికి జిల్లాకేంద్రంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. కొన్నిరోజుల పాటు ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదే సమయంలో రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో ప్రత్యేక నిధుల కింద రూ.100 కోట్లు మంజూరు చేసింది. అనంతరం పలు సందర్భాల్లో మంత్రి త్వరలోనే ఆయా వార్డులు పర్యటించి కావాల్సిన పనులను గుర్తిస్తామన్నారు. సీసీరోడ్ల నిర్మాణంతోపాటు డ్రెయినేజీల మరమ్మతు, ఇతర పనులు చేపడతామన్నారు. అయితే ఇప్పటి వరకు ఎలాంటి కార్యాచరణకు శ్రీకారం చుట్టకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయి. పట్టణంలో మొత్తం 49 వార్డులకు గాను 2,88,026 జనాభా ఉంది. కొత్త పాలకవర్గం ఏర్పడి మూడేళ్లు దాటినా.. నిధుల లేమితో పూర్తిస్థాయిలో పనులు చేయించలేకపోయారు. ఇదే క్రమంలో ఆరు నెలల క్రితం మంజూరైన రూ.100 కోట్లు ఏయే పనులకు కేటాయించాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నా ప్రయోజనం దక్కడం లేదు. మరోవైపు పట్టణం శరవేగంగా విస్తరిస్తోంది. ప్రతి వార్డులోనూ కొత్త కాలనీలు వెలుస్తూనే ఉన్నాయి. చాలాచోట్ల సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాల్సిన అవసరం ఉంది. మట్టి రోడ్లపైనే ఇళ్ల నుంచి మురుగు ఏరులై పారుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఎక్కడికక్కడ మురుగు గుంటలు ఏర్పడి దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు విజృంభించడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మా కాలనీ అయ్యప్ప గుట్ట అంచునే ఉంటుంది. వర్షాకాలంలో మట్టి రోడ్లపై నీరు పారి నడవలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటి వరకు ఒకే వీధిలో సీసీరోడ్డు, డ్రెయినేజీ ఉంది. మిగిలిన నాలుగైదు వీధుల్లో మురుగు ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. కంపచెట్లు ఏపుగా పెరిగాయి. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మంజూరు చేయించిన ప్రత్యేక నిధులతోనైనా కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి.

– సుదర్శన్‌యాదవ్, భాగ్యనగర్‌కాలనీ, 9వ వార్డు

సీసీలు, డ్రెయినేజీలు లేవు



యాదవ కమ్యూనిటీ హాల్ ప్రాంతం నుంచి డబుల్ బెడ్‌రూం ఇళ్ల వరకు మధ్య పావు కిలోమీటరు ఇంకా మట్టి రోడ్డే ఉంది. వంపులో అధ్వానంగా తయారైంది. చీకట్లో నడవడానికి కూడా రావడం లేదు. ఎక్కడ ఏ గుంత ఉందో తెలియని పరిస్థితి. మా గల్లీలో చాలా చోట్ల సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేవు. మున్సిపాలిటీకి మంజూరైన ప్రత్యేక నిధులతోనైనా ఈ పనులు చేపడితే బాగుంటుంది.

– నిర్మల, వీరభద్రకాలనీ, 14వ వార్డు

త్వరలోనే చేపడతాం

ఇటీవల వివిధ వార్డుల పర్యటనలో భాగంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు స్థానికుల నుంచి కొన్ని సమస్యలపై విజ్ఞప్తులు అందాయి. వీటికి సంబంధించి ఇప్పటి వరకు రూ.3 కోట్ల పనులను గుర్తించి టెండర్లు పిలిచాం. త్వరలోనే ఈ పనులు చేపడతాం. మిగిలిన అన్ని వార్డులనూ తిరిగి వీలైనంత వరకు రూ.100 కోట్లకు సంబంధించిన పనులకు శ్రీకారం చుడతాం.

– నర్సింహులు, మున్సిపల్ చైర్మన్, మహబూబ్‌నగర్

పనులు చేపట్టాలని ఆదేశం

జిల్లాకేంద్రంలో రూ.100 కోట్లకు సంబంధించిన పనులు చేపట్టాలంటూ గత నెల 29న జరిగిన మున్సిపల్ వార్షిక బడ్జెట్ సమావేశంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. అవసరమైతే మరో రూ.50 కోట్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలోనే గత నెల 31న మున్సిపల్ చైర్మన్ నర్సింహులు స్థానిక అధికారులతో సమీక్షించి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు.



బండమీదిపల్లి- బుడగజంగం కాలనీలో ఇళ్ల ఎదుట రోడ్డుపై పారుతున్న మురుగు

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

అచ్చంపేట రూరల్: విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతిచెందిన ఘటన ఆదివారం ఉదయం మండలంలోని దర్గాతండాలో చోటు చేసుకుంది. తండావాసుల కథనం మేరకు.. తండాకు చెందిన మూడావత్ హర్య(28) ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. ఆదివారం ఉదయం ఇంటి గోడలకు నీటిని పడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. అపస్మారకస్థితిలో ఉన్న హర్యను వెంటనే కుటుంబసభ్యులు అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. హర్యకు భార్య సుగుణ, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

పొలెంలో..


రమేష్ (ఫైల్)

బిజినేపల్లి: మండలంలోని పొలెంలో ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రమేష్ (35) గ్రామంలోనే ల్యాబ్ నిర్వహించుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆదివారం ఉదయం కొళాయి వస్తుండటంతో సంపు మోటార్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే 108 వాహనంలో నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. రమేష్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు.

మహిళ బలవన్మరణం

అమరచింత: ఉరేసుకొని ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ బాలస్వామి తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఆత్మకూర్ వేంకటేశ్వరకాలనీలో ఉంటున్న సుధ (40) ఏడేళ్ల కిందట మతిస్థిమితం కోల్పోయిందని.. పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తుండేదని తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున ఇంటి వరండాలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సుధకు భర్త అనిల్, కుమార్తె, కుమారుడు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని హెడ్ కానిస్టేబుల్ వివరించారు.

యువకుడి అదృశ్యం : కేసు నమోదు


అశోక్‌గౌడ్

దేవరకద్ర రూరల్: మండలంలో ఓ యువకుడు అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని డోకూర్‌కు చెందిన అశోక్‌గౌడ్ (27) ఈ నెల 9న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు తెలిసిన వారు, బంధువులను ఆరా తీసినా ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం తల్లి జయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ తెలిపారు.

సిబ్బంది లేక ఇబ్బంది..

- బాదేపల్లి మార్కెట్ యార్డులో ఏళ్లుగా అవస్థలు
- మొత్తం 20 పోస్టులకు 13 ఖాళీలు
- పోస్టుల భర్తీపై దృష్టిపెట్టని పాలకులు, అధికారులు

రాష్ట్రంలోనే పేరుమోసిన బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో పూర్తి స్థాయిలో సిబ్బంది లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక్కడ కేవలం ముగ్గురు, నలుగురు సిబ్బందితో నెట్టుకురావాల్సిన దుస్థితి నెలకొంది. ఐదారు సంవత్సరాలకు పైగా ఇదే పరిస్థితి నెలకొంది. ఫలితంగా రైతులకు, వ్యాపారులకు సేవలు సకాలంలో అందడం లేదు.


సిబ్బంది లేక వెలవెలబోతున్న వ్యవసాయ మార్కెట్‌యార్డు కార్యాలయం

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో మొత్తం 20మంది సిబ్బందికి కేవలం ఏడుగురు మాత్రమే పనిచేస్తున్నారు. మిగతా పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఖాళీగా ఉన్నాయి. ఐదుగురు సూపర్‌వైజర్‌లు ఉండాలి. కానీ ఇద్దరు మాత్రమే ఉన్నారు. అదేవిధంగా గ్రేడ్-3 పోస్టు కూడా ఖాళీగా ఉంది. గతంలో సహాయ కార్యదర్శి ఉన్నా ఆ పోస్టును బాలానగర్ యార్డుకు బదిలీ చేశారు. ఇక గ్రేడర్, టైపిస్ట్, జేఎంఎస్, రెండు ఎల్‌డీసీ పోస్టులతో పాటు ఐదు వాచ్‌మెన్ పోస్టులు, రెండు అటెండర్, తదితర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి భర్తీ గురించి ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా పట్టించుకోవడం లేదు.

ఇబ్బందులు ఏంటంటే..

పూర్తిస్థాయిలో కార్యాలయం సిబ్బంది లేకపోవడంతో రైతులతో పాటు వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, హమాలీలు, తదితరులకు సకాలంలో సేవలు అందించే పరిస్థితి లేకపోతుంది. మార్కెట్ యార్డులో పర్యవేక్షణ కరువవ్వడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రైతులకు తగు సూచనలు చేయడంలో విఫలమవుతున్నారు. అంతేగాక రైతులు తమ సమస్యలకు సంబంధించి యార్డు సెక్రటరీకి ఫిర్యాదు చేయాలంటే అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. దీంతో కాలయాపన జరిగి సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. అదేవిధంగా మార్కెట్‌యార్డులో సరైన నిఘా లేకపోవడంతో రైతులు తెచ్చిన ధాన్యానికి సైతం రక్షణ కరువయ్యింది. రైతుల ధాన్యం నాణ్యత, నాణ్యతకు తగిన ధర అందుతోందా లేదా అని పరిశీలించేవారు కరువయ్యారు. పత్తి మార్కెట్‌లో కూడా పత్తి క్రయవిక్రయాలు కొనసాగుతుండంతో సిబ్బంది లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సకాలంలో ధరలు ప్రకటించడంలో కాలయాపన జరుగుతోంది. దీంతో చీకటి పడేదాక రైతులు పడిగాపులు గాసే పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ పూర్తిస్థాయిలో ఉండేలా సెక్రటరీని నియమించాల్సిన అవసరం ఉంది.


బాదేపల్లి యార్డు కార్యాలయం

ఈ-నామ్ మార్కెట్..

బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డును ఈ-నామ్‌గా గుర్తించారు. కానీ ఈ-నామ్‌కు తగిన విధంగా వసతులు, సిబ్బంది నియామకం చేయలేదు. ఈ-నామ్ సక్రమంగా అమలు కావాలంటే పూర్తిస్థాయిలో సిబ్బంది అవసరం ఎంతైనా ఉంది. కానీ పేరుకు మాత్రమే నామ్‌గా ఉండి సిబ్బంది లేకపోవడంతో లక్ష్యం నీరుగారే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించి రైతులకు సత్వరమే సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా పలువురు కోరుతున్నారు.

సమస్యను నివేదిస్తాం..



సమస్యలను ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్తాం. కార్యాలయం సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. భర్తీ చేసేవిధంగా ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లాం. ఇతర ప్రాంతాలలో డిప్యుటేషన్‌పై వెళ్లిన వారిని తిరిగి బాదేపల్లి యార్డుకు తీసుకువచ్చే విధంగా కృషి చేస్తాం. పూర్తిస్థాయిలో యంత్రాంగం ఉంటేనే రైతులకు సత్వర సేవలు అందుతాయి. ఆ దిశగా చర్యలు తీసుకుంటాము.

– గోవర్ధన్‌రెడ్డి, చైర్మన్, బాదేపల్లి మార్కెట్ యార్డు

పోస్టులు ఖాళీగా ఉన్నాయి..



బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డు కార్యాలయంలో చాలా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏళ్ల తరబడి పోస్టులు ఖాళీగా ఉండడంతో కార్యాలయం నుంచి సకాలంలో కావలసిన సేవలు అందించలేని పరిస్థితి నెలకొంది. పోస్టులు భర్తీ చేసేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

– నవీన్, సెక్రటరీ, బాదేపల్లి మార్కెట్ కార్యాలయం

‘కౌలు’ వేలం..

నేడు, రేపు అలంపూర్ ఆలయాల భూములకు కౌలు వేలం పాట

- గతంలో గుట్టుగా దేవుడి భూముల లీజు
- కౌలు వేలం బకాయిలు రూ.60 లక్షలపైనే..
- సబ్ లీజులు.. ఆలయ సిబ్బంది చేతివాటం


ఆలయ సీనియర్ ఉద్యోగులు గుట్టుగా లీజుకు ఇచ్చిన కర్నూలులోని ఆలయ భూమి

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ ఆలయాల్లో దేవాదాయశాఖ వారు ప్రతి రెండేళ్లకు ఓసారి ఆలయ భూముల కౌలు వేలం నిర్వహిస్తారు. వచ్చిన ఆదాయంతో ఆలయాల నిర్వహణ, అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ మాత్రం వేలం నిర్వహిస్తున్నారే తప్పా.. బకాయిలు వసూలు చేయడంలో విఫలమవుతున్నారు. ఆలయానికి 400 ఎకరాలకుపైగా భూమి ఉండగా.. రెండేళ్ల కిందట 359.05 ఎకరాలకు కౌలు వేలం నిర్వహించారు. రూ.24.65 లక్షలు పాట పాడారు.. కానీ ఇంకా రూ.11,47,500 వసూలు కావాల్సి ఉంది. ఇదిలా ఉండగానే సోమ, మంగళవారాల్లో సుమారు 420.13 ఎకరాలకు మళ్లీ కౌలు వేలం నిర్వహించనున్నారు.

అధికారుల నిర్లక్ష్యమే కారణమా?

రెండేళ్ల క్రితం అప్పటి ఈఓ ప్రేమ్‌కుమార్ హయాంలో నిర్వహించిన కౌలు వేలంలో పలు అక్రమాలు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆలయానికి చెందిన కొంత భూమికే వేలం నిర్వహించారు. కర్నూలు జిల్లా కల్లూరులోని సర్వేనంబర్ 346/1, 346/3లోని 15.35 ఎకరాల భూమికి కౌలు వేలం నిర్వహించకుండా దాచారు. అయితే ఆ భూమిని ఆలయంలోని సీనియర్ ఉద్యోగులు కొందరు గుట్టుచప్పుడు కాకుండా లోలోపలే లీజుకు ఇచ్చుకొని సొమ్ము చేసుకున్నారు. ఈ విషయాన్ని ‘సాక్షి’ దినపత్రిక వెలుగులోకి తేవడంతో సమస్య జఠిలం కాకుండా అప్పటి కమిటీ రూ.75 వేలు చెల్లించాలని తీర్మానించింది. కానీ నేటికీ ఆ డబ్బులు మాత్రం ఆలయ ఖాతాలో జమకాలేదు. అదేవిధంగా ఆలయ భూములు చాలాకాలంగా కౌలుకు ఇస్తున్నా.. వసూలు చేయడంలో అధికారులు, ఆలయ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. 12 ఏళ్ల నుంచి సమారు రూ.60 లక్షలపైనే కౌలు డబ్బులు బకాయిలున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా..

కొందరు ఆలయ భూములను లీజుకు తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా ఇతర వ్యాపారులకు వినియోగిస్తున్నారు. భైరాపురం సమీపంలోని భూములను కౌలుకు తీసుకున్న ఓ వ్యక్తి పంటలు సాగు చేయకుండా బొగ్గు వ్యాపారులకు సబ్ లీజుకు ఇచ్చినట్లు తెలిసింది. అదేవిధంగా ఇమాంపురం శివారులోని భూమి నుంచి సుద్ద మట్టిని విక్రయిస్తుండగా ఆ విషయన్ని ‘సాక్షి’ వెలుగులోకి తేవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇదిలా ఉండగా సింగవరంలోని సర్వే నంబర్ 614లో 26.06 ఎకరాల భూమిని ఒకరు రూ.3.52 లక్షలకు కౌలుకు తీసుకున్నారు. ఆ భూమిలో ప్రవేట్ వ్యక్తి కిరాణం దుకాణం నిర్వహించడంతో పాటు మద్యం కూడా విక్రయిస్తున్నారు. కౌలు వసూలుకు వెళ్లిన ఈవో పురేందర్ కుమార్ దుకాణం చూసి అవాక్కయ్యారు.


ఆలయ భూమిలో వెలిసిన కిరాణ దుకాణం.. నిర్వాహకుడితో మాట్లాడుతున్న ఈఓ

కౌలుకు తీసుకున్న వ్యక్తిని పిలిపించి దుకాణం ఎవరిని అడిగి వేయించావని ఆగ్రహం వ్యక్తం చేసి తొలగించాలని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు అనేకం చోటు చేసుకోవడం గమనార్హం.

కఠినంగా వ్యవహరిస్తా..



బాధ్యతలు చేపట్టి ఏడాది అయింది. గతంలో జరిగిన అన్ని తప్పిదాలపై విచారణ చేయిస్తున్నా. అలాగే కౌలు బకాయిల వసూలు కోసం కోర్టు నోటీసులు ఇచ్చాం. 420.13 ఎకరాల ఆలయ భూమికి సోమ, మంగళవారం వేలం నిర్వహిస్తున్నాం. ఆలయానికి రావాల్సిన ప్రతి పైసా వసూలు చేసేందుకు కఠినంగా వ్యవహరిస్తా. దేవస్థానంలో జరిగే తప్పిదాలపై విచారణ చేపడుతాం.

– పురేందర్‌కుమార్, ఈఓ

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

ఉమ్మడి పాలమూరు జిల్లాలో వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. ఆయా ఘటనలకు సంబంధించి వివరాలిలా..

గద్వాల క్రైం: కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందినట్లు గద్వాల రూరల్ ఎస్ఐ ఆనంద్ తెలిపారు. వివరాలిలా.. అడ్డాకుల మండలం చాగాపురం గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి(35) తన స్నేహితుడు కురుమూర్తితో కలిసి ఆదివారం సాయంత్రం బైక్‌పై గద్వాల నుంచి ఎర్రవల్లి వైపు బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎర్రవల్లి నుంచి గద్వాల వైపు వస్తున్న కారు అనంతపురం గ్రామ శివారు వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108లో చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మోహన్‌రెడ్డి మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారు యజమాని సుదర్శన్‌రెడ్డి పరారయ్యాడని ఎస్ఐ చెప్పారు.

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్ : ఒకరి మృతి

జడ్చర్ల: ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. జడ్చర్ల శివారులో జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. కావేరమ్మపేటకు చెందిన సురేష్(26) ద్విచక్రవాహనంపై వస్తుండగా ఏఎస్ఆర్ గార్డెన్ ఎదరుగా టిప్పర్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సురేష్ కావేరమ్మపేట శివారులో గల పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నట్లు స్థానికులు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్రేన్ ఢీకొని మరొకరు..

దేవరకద్ర రూరల్: ద్విచక్రవాహనాన్ని హైడ్రాలిక్ క్రేన్ ఢీకొట్టిన సంఘటనలో ఒకరు మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఎస్ఐ వెంకటేష్ కథనం ప్రకారం.. నర్వ మండలంలోని కుమ్మరిలింగంపల్లికి చెందిన వడ్డే నర్సింహులు(58), స్నేహితుడు గొల్ల సత్యప్పతో కలిసి పనినిమిత్తం దేవరకద్ర వైపు వచ్చి తిరిగి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గోప్లాపూర్ శివారులో హైడ్రాలిక్ క్రేన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నర్సింహులు అక్కడికక్కడే మృతిచెందగా.. సత్యప్పకు గాయలయ్యాయి. సమాచారం మేరకు ప్రమాద స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

- నిఖిత హత్యను మర్డర్ కేసుగా నమోదు చేయాలి
- ఛలో అచ్చంపేటలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ


అచ్చంపేటలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

అచ్చంపేట రూరల్: మన్ననూర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో మృతి చెందిన నిఖిత హత్యపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని, మర్డర్ కేసుగా నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. నిఖిత హత్యకు పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేసి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఎమ్మార్పీఎస్, అఖిలపక్ష పార్టీలు, పలుసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ఛలో అచ్చంపేట విజయవంతమైంది. అచ్చంపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మందకృష్ణ మాదిగతో పాటు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అద్దంకి దయాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అణగారిన మహిళలు, విద్యార్థులపై అఘాయిత్యాలు జరుగుతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. అగ్రవర్ణాలకు జరిగితే వెంటనే ప్రభుత్వం స్పందిస్తుందన్నారు. మహిళలు, విద్యార్థులకు రాష్ట్రంలో రక్షణ లేకుండా పోయిందన్నారు. నిఖితది ముమ్మాటికీ హత్యేనని, నిందితులను వెంటనే గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్యార్థిని కుటుంబానికి దళితబంధు పథకం ముఖ్యంకాదని, రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యార్థినిని ఉరితీసి ఆత్మహత్యగా చిత్రీకరించారన్నారు. అందుకు పోలీసులు, వైద్యులు సహకరించారని ఆరోపించారు. హత్య జరిగినట్లు ఆధారాలు కన్పిస్తున్నాయని, విద్యార్థినిని దాడి చేసిన వారిని గుర్తించాలని అన్నారు. ఆ స్కూల్‌లో జరుగుతున్న తంతంగాన్ని బయట పెట్టాలన్నారు. అంతకుముందు అద్దంకి దయాకర్ మాట్లాడుతూ అచ్చంపేటలో అనేక అరాచకాలు జరుగుతున్నాయని, ఎమ్మెల్యే బాలరాజు అరాచకాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సాక్ష్యాలు బయటకు రావాలన్నారు. విద్యార్థిని కుటుంబానికి న్యాయం జరిగే వరకు, ప్రభుత్వం దిగి వచ్చే వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు మోపతయ్య, సాట కాశీంమాదిగ, దేశ్యానాయక్, కాశన్నయాదవ్, మల్లేష్, గౌరీశంకర్, రామనాథం, మల్లిఖార్జున్, మంగ్యానాయక్, శ్రీనివాసులు, శంకర్‌నాయక్, పాల్గొన్నారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు

- మహిళ మెడలోని ఆభరణాల కోసం హత్య
- ఈనెల 12న కల్వకుర్తిలో ఘటన

కల్వకుర్తి రూరల్: బంగారు ఆభరణాల కోసం గిరిజన మహిళ పింక్లిని హత్య చేసిన సంఘటనను పోలీసులు ఛేదించారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కల్వకుర్తి మండలం ఎల్లికల్‌తండాకు చెందిన పింక్లి ఈనెల 12నుంచి కనిపించడం లేదని భర్త సారియ కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మహిళ తప్పిపోయిన సమయంలో ఏం జరిగిందనే విషయాలను పరిశీలించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల రికార్డును పరిశీలించారు. అశోక టాకీస్ సమీపంలో ఉన్న కల్లు కాంపౌండ్‌లో పింక్లి భర్త సారియ కల్లు తాగి, ఆ మత్తులో ఉన్న పింక్లిని శ్రీశైలం సత్యమ్మ ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని మండలంలోని పంజుగుల వైపు వెళ్లారు. అక్కడి నుంచి రామగిరి గుట్టలోకి తీసుకెళ్లినట్లు విచారణలో తేలిందని ఎస్ఐ తెలిపారు.

బంగారు ఆభరణాల కోసమే..

తెలకపల్లి మండలం కార్వంగకు చెందిన, శ్రీశైలం బిజినేపల్లి మండలం చర్లలింగంపల్లికి చెందిన సత్యమ్మ నాగర్‌కర్నూల్‌లో కూలీ పని చేస్తున్నారు. భర్త చనిపోయిన సత్యమ్మ శ్రీశైలంతో సహజీవనం చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. వీరిద్దరు ఈనెల 12న కల్వకుర్తి కల్లు దుకాణంలో పింక్లితో పాటు కల్లు తాగారు. మృతురాలి వంటిపైఉన్న బంగారు ఆభరణాలపై కన్నేసి, ఆమెను ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి బంగారు ఆభరణాలు లాక్కుని రాళ్లతో కొట్టి చంపారని పోలీసులు తెలిపారు. వెల్దండ సీఐ రామకృష్ణ, ఎస్ఐ రమేశ్ యాదవ్ విచారణ జరిపి, గిరిజన మహిళను హత్య చేసిన శ్రీశైలం, సత్యమ్మను అదుపులోకి తీసుకున్నారు. వారిపై వివిధ సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

జల్సాలకు అలవాటుపడి..

జడ్చర్ల: జల్సాలకు అలవాటుపడిన ఓ జంట వృద్ధురాలిని ఆటోలో తీసుకెళ్లి ఆమెవద్ద ఉన్న బంగారు నగలు, నగదు లాక్కొని హత్య చేసేందుకు యత్నించారని.. నిందితుల్లో ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. ఆదివారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పూర్తి వివరాలు వెల్లడించారు. నారాయణపేట జిల్లా మద్దూర్ మండలం నందిపాడ్‌కు చెందిన అయ్యగారి రామకృష్ణమ్మ మండలంలోని పెద్దపల్లిలో ఉన్న తమ్ముడి ఇంటికి వెళ్లేందుకు ఈ నెల 11న జడ్చర్ల క్రాస్‌రోడ్ వద్ద ఆటో కోసం నిలబడి ఉంది. అదే సమయంలో మూసాపేట మండలానికి చెందిన ఆటోడ్రైవర్ రమేష్, మహబూబ్‌నగర్ ఎర్రసత్యంకాలనీకి చెందిన స్వప్న కలిసి రామకృష్ణమ్మతో మాటామాటా కలిపి పెద్దపల్లికే వెళ్తున్నామని ఆటోలో ఎక్కించుకున్నారు. మార్గమధ్యంలో చీకూరిగూడెం వద్ద నిర్మానుష్య ప్రాంతంలో ఆటో నిలిపి ఆమెవద్ద ఉన్న బంగారు నగలు ఇవ్వాలని బెదిరించారు. ఇవ్వకపోవడంతో కత్తితో గాయపర్చి బంగారు గుండ్లపత్తీల దండ, చెవులకు ఉన్న కమ్మలు, సెల్‌ఫోన్, రూ.3 వేల నగదు లాక్కొని ఆమెపైకి ఆటో ఎక్కించారు. హత్య చేసేందుకు యత్నించగా చాకచక్యంగా తప్పించుకొని తెలిసిన వ్యక్తి అశోక్‌ను కలిసింది. ఆయన 108 వాహనంలో జిల్లాకేంద్రంలోని ఎస్వీఎస్ ఆస్పత్రికి పంపించారు. బాధితురాలి అల్లుడు గుంతల శ్రీను ఫిర్యాదు మేరకు సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా వివరాలు సేకరించి నిందితుల్లో ఒకరైన స్వప్నను అదుపులోకి తీసుకుని బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. రమేష్ పరారీలో ఉన్నాడని.. బాధితురాలు కోలుకుంటుందని వెల్లడించారు.

అకాల వర్షాలతో జాగ్రత్త


వరి పొలాల నుంచి నీటిని తొలగించడం (ఫైల్)


వరి పైరును గట్లపై వేసిన దృశ్యం(ఫైల్)

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: అకాల వర్షాలతో పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. ప్రధానంగా వివిధ దశలో ఉన్న మొక్కజొన్న, పత్తి, వరి, పసుపు పంటకు నష్టం చేకూరే అవకాశాలు ఉన్నాయి. గతంలో కురిసిన అకాల వర్షాలతో రైతులకు నష్టాలు తప్ప లేదు. ఈ దశలో పంటను కాపాడుకోవడానికి రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని ఏడీఏ సక్రియ నాయక్ సూచిస్తున్నారు. ఆయన సూచనల మేరకు జాగ్రత్తలు తీసుకుంటే కొంత వరకు రైతులకు మేలు కలుగుతుందని వివరిస్తున్నారు. వివిధ పంటను కాపాడుకోవడానికి సూచనలు ఇలా..

మొక్కజొన్న

కోతకు వచ్చిన పంటను వాతవరణాన్ని దృష్టిలో ఉంచుకోని కోత కోయాలి. వర్షాలు వచ్చే అవకాశం ఉంటే కోతకోయరాదు. వర్షాలు పూర్తిగా తగ్గిన తర్వాత కోతను ప్రారంభించుకోవడం మంచిది. కోసిన కంకులు తడిస్తే వెంటనే పొలం నుంచి బయటికి తెచ్చి ప్రత్యేక గాలి మరల ద్వారా 100 శాతం ఆరబెట్టాలి. ఇలా ఆరబెట్టకపోతే ధాన్యం రంగు మారుతుంది. బూజుపట్టే అవకాశం లేకపోలేదు. తినడానికి పనికి రాకుండా పోవడం, విక్రయానికి తీసుకెళ్లిన ఆశించిన మద్దతు ధర లభించదు. గింజలు తడిస్తే నీడలో ఆరబెట్టి గాలి పంకల ద్వారా ఆరబెట్టుకోవాలి. వర్షాలు తగ్గిన తర్వాత ఎండలో ఆరబెట్టి నిల్వ చేసుకోవాలి.

వరి

వరి పంట ప్రస్తుతం చివరి దశలో, గింజ గట్టిపడి కోతకు సిద్ధంగా ఉంది. కోతకు సిద్ధంగా ఉన్నా.. లేదా గింజ గట్టిపడి వెన్ను వంగి ఉన్న దశలో పైరు పడిపోతే పొలంలోకి చేరిన నీటిని తొలగించుకోవాలి. గింజకు శీలింద్రాలు ఆశించకుండా గింజ నల్లబడకుండా ఉండటానికి లీటర్ నీటికి 2 మి.లీ. హెక్సా కొన జోల్ కలిపి పిచికారి చేసుకోవాలి. ఖాళీగా ఉన్న పొలాల్లో ఈ తేమతో దుక్కి దున్నుకోవాలి. హైబ్రీడ్ వరిలో వర్షాల వలన సుంకు రాలిపోతుంది. ఈ మేరకు కొంత నష్టం వాటిల్లుతుంది. కోత దశలో ఉన్న సమయాల్లో తొందరపడి కోయకుండా వారం రోజుల పాటు ఆగి ఆ తర్వాత మొదలు పెట్టాలి. కోసిన పైర్లను పొలాల్లో కాకుండా గట్ల మీద వేసుకోవాలి. పొలాల్లోనే ఉంటే మొలకలు వచ్చే ప్రమాదం ఉంది. గట్లపై వేసిన పైరుపై లీటర్ నీటికి 50 గ్రాముల ఉప్పు కలిపి చల్లాలి. ఇలా చేస్తే మొలక రాదు. వర్షాలు తగ్గిన తర్వాత పంటను నూర్పిడి చేసి ఎండలో ఆరబెట్టి నిల్వ చేసుకోవాలి.


వర్షాలకు దెబ్బతిన్న వరి పంట (ఫైల్)

పత్తి

పత్తి సాగు చేసిన రైతులు ఎట్టి పరిస్థితుల్లో పంట పైరు కాలన్నీ పొడిగించరాదు. తేమను ఆసరగా చేసుకుని లోతు దుక్కిలు చేసుకోవాలి.

పసుపు

తడిసిన దుంపలను భూమి నుంచి వేరు చేసి టార్పాలిన్‌లతో కప్పుకోవాలి. దుంపలు తడవడం వలన ఎండిన తర్వాత రంగు మారుతాయి. మార్కెట్‌కు తీసుకెళ్తే మంచి ధర లభించే అవకాశం ఉండకపోవచ్చు. ఆశించిన ధర లభించాలంటే దుంపలను పాలిషింగ్ చేయాలి. దీని వలన నాణ్యత పెరిగి మంచి ధర లభిస్తోంది. అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి వారి సహాయ సహకారాలను తీసుకోవాలి.

క్లుప్తంగా...



గర్భిణిని అంబులెన్స్‌లో తరలిస్తున్న ఎంపీపీ సుధీర్‌రెడ్డి

అంబులెన్స్ డ్రైవర్‌గా ఎంపీపీ

బొమ్మలరామారం: అత్యవసర పరిస్థితిలో అంబులెన్స్ డ్రైవర్ అందుబాటులో లేకపోవడంతో.. ఓ ఎంపీపీ డ్రైవర్‌గా మారి గర్భిణీని ఆస్పత్రికి తరలించి అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం ఖాజీపేట్ గ్రామంలోని ఇటుక బట్టీలో పని చేసే ఓ వలస కార్మికురాలు గర్భవతి. ఆమె వైద్య పరీక్షల నిమిత్తం ఆదివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి వచ్చింది. మెరుగైన వైద్యం అవసరమని భావించిన సిబ్బంది, ఆమెను భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఆమెను తీసుకెళ్లడానికి పీహెచ్‌సీలోని అంబులెన్స్ డ్రైవర్ అందుబాటులో లేకపోవడంతో.. నిర్వహణ బాధ్యతలు తీసుకున్న ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డికి సిబ్బంది సమాచారం అందించారు. సదరు గర్భిణీకి అత్యవసరంగా వైద్యం అవసరమని తెలిపారు. వెంటనే ఎంపీపీ సుధీర్‌రెడ్డి తానే డ్రైవర్‌గా మారి, గర్భిణీని అంబులెన్స్‌లో భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం వైరల్ కావడంతో ఎంపీపీని స్థానికులు అభినందిస్తున్నారు.

బీసీ కుల గణన సాధన కోసం పోరుబాట: జాజుల

లాలాపేట: బీసీ కుల గణన చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న నల్గొండ నుంచి నడిగడ్డ వరకు 33 జిల్లాల్లో బీసీల పోరుబాట కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చే క్రమంలో రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్న బీసీల పోరుబాటకు బీసీ సంఘాలు, కుల సంఘాలు, మేధావులు, ఉద్యోగులు మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం ఓయూ ప్రొఫెసర్స్ క్వార్టర్స్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ కుల గణన చేస్తామని మొట్టమొదటిసారి తెలుగు రాష్ట్రాల నుంచి ఏపీ సీఎం వైఎస్ జగన్ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. ఏపీ సీఎం జగన్‌ను ఇతర రాష్ట్రాల సీఎంలు ఆదర్శంగా తీసుకుని అంసెబ్లీలో తీర్మానాలు చేసి కేంద్రానికి పంపాలని కోరారు.

మక్కలు ఇంకెప్పుడు కొంటరు?

ఇంకా ఏర్పాటుకాని కొనుగోలు కేంద్రాలు

- ప్రభుత్వ నిర్ణయం కోసం మార్క్‌ఫెడ్ ఎదురుచూపులు
- అనుమతితో పాటు బ్యాంక్ గ్యారెంటీ ఇస్తేనే ముందుకు సాగే యోచన
- మార్కెట్‌లో పడిపోతున్న ధర
- ఆందోళనలో రైతాంగం



కామారెడ్డి జిల్లా భిక్కనూరులో సర్వీస్ రోడ్డుపై ఆరబోసిన మక్కలు

సాక్షి, కామారెడ్డి: మక్కల కొనుగోలుపై సర్కారు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో దళారులు చెప్పిందే ధర అవుతోంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం, మార్కెట్‌లో మక్కల ధర రోజురోజుకూ పతనం అవుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. యాసంగి సీజన్‌లో రాష్ట్రంలో 6,48,446 ఎకరాల్లో మక్క పంట సాగైంది. ఈసారి పంట ఆశాజనకంగా ఉండటంతో దిగుబడి కూడా ఎక్కువగా వస్తుందని భావిస్తున్నారు. సగటున ఎకరాకు 29 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ చెబుతోంది. ఈ లెక్కన మొత్తంగా దాదాపు 2 కోట్ల క్వింటాళ్ల మక్కల దిగుబడి వచ్చే అవకాశాలున్నాయని అంటున్నారు. కాగా మక్కల కొనుగోలు వ్యవహారాన్ని మార్క్‌ఫెడ్ చూస్తుంది. అయితే ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌కు అనుమతి ఇవ్వడంతో పాటు అవసరమైన బ్యాంక్ గ్యారెంటీ ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా చేస్తేనే మార్క్‌ఫెడ్ మక్కల కొనుగోలు ప్రక్రియ మొదలుపెడుతుంది. కానీ సర్కారు ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో మక్కల కొనుగోలు వ్యవహారం ముందుకు సాగడం లేదు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో మక్క పంట కోసి, జూళ్లు వేశారు. కొన్ని ప్రాంతాల్లో జూడు తీసి, మక్కలు ఒలిచి ఆరబెడుతున్నారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో మక్క కోయాల్సి ఉంది.

■ **తగ్గుతున్న ధర..**

మక్క పంట చేతికి అందే సమయంలో తొలుత బహిరంగ మార్కెట్‌లో క్వింటాలుకు రూ.2,400 వరకు ధర పలికింది. కానీ పక్షం రోజులుగా ధర తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.1,800 మాత్రమే చెల్లిస్తున్నారు. గతంలో పౌల్ట్రీ పరిశ్రమలో కోళ్లకు దాణాగా మక్కలను వాడేవారు. ప్రస్తుతం మక్కల కన్నా బియ్యం నూకలు తక్కువ ధరకు లభిస్తుండటంతో పౌల్ట్రీ రంగం మక్కల కొనుగోలుపై ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. దీంతో స్థానికంగా మక్కలకు డిమాండ్ పడిపోతోంది. మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తే తప్ప తమకు మద్దతు ధర లభించే అవకాశం లేదని రైతులు చెపుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు ఏర్పాటు చేస్తుందా అని వారు ఎదురుచూస్తున్నారు.

మార్క్‌ఫెడ్ కొనాలి..



నేను మూడు ఎకరాల్లో మక్క పండించిన. ఈసారి పంట మంచిగనే వచ్చింది. అయితే మార్కెట్‌లో మద్దతు ధర లభించడం లేదు. మొదట్లో క్వింటాలుకు రూ. 2,400 ధర పలికింది. ఇప్పుడు అమ్ముదామనే సమయానికి రూ.1,800లకు పడిపోయింది. మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.

–గడ్డం బాల్‌రెడ్డి, రైతు, మోతె, లింగంపేట మండలం, కామారెడ్డి జిల్లా

కేంద్రాలు తెరవకుంటే ఇబ్బందే



ప్రభుత్వం మక్కల కొనుగోలుకు కేంద్రాలు ఏర్పాటు చేస్తేనే మాకు నాలుగు పైసలు మిగులుతయి. లేకుంటే ఏం లాభం ఉండదు. ఇప్పుడు మార్కెట్‌లో ఉన్న ధరకు అమ్ముకుంటే అప్పులే మిగులుతయి. కేంద్రాల ఏర్పాటు ఇప్పటికే ఆలస్యమైంది. ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకుని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలి.

– బందారి లింగం, రైతు, తాడ్వాయి మండలం, కామారెడ్డి జిల్లా



బీబీనగర్ టోల్‌గేట్ వద్ద నిలిచిన వాహనాలు

హైవేపై వాహనాల రద్దీ

చౌటుప్పల్, బీబీనగర్: యాదాద్రి భువనగిరి జిల్లా హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం ఒక్కసారిగా వాహనాల రద్దీ పెరిగింది. శుభకార్యాలు ఉండడంతో హైదరాబాద్ జంటనగరాలతో పాటు వివిధ ప్రాంతాల ప్రజానీకం వాహనాల్లో రాకపోకలు సాగించారు. దాంతో చౌటుప్పల్ పట్టణంలో, జంక్షన్‌ల వద్ద రోడ్డు దాటేందుకు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. అదేవిధంగా యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం మండలంలోని గూడూరు టోల్‌ప్లాజా వద్ద కూడా వాహనాల రద్దీ నెలకొంది. యాదాద్రి పుణ్యక్షేత్రానికి భక్తులు పెద్దఎత్తున వాహనాల్లో తరలి రావడంతో టోల్‌ప్లాజా వద్ద ఉదయం, సాయింత్రం సమయాల్లో విపరీతమైన రద్దీ ఏర్పడింది.

యూఏఈలో విజిట్ వీసా నిబంధనలు కఠినతరం

- గడువు తీరిన తర్వాత ఉంటే నిషేధిత జాబితాలోకి..
- యూఏఈతో పాటు ఇతర గల్ఫ్ దేశాల్లో ప్రవేశంపై నిషేధం



మోర్తాడ్(బాల్కొండ): వీసా నిబంధనల ఉల్లంఘనలను అరికట్టడానికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం కఠిన నిబంధనలను అమలులోకి తీసుకువచ్చింది. విజిట్ వీసాలపై యూఏఈకి వచ్చినవారు గడువు ముగిసిన తర్వాత ఒక్కరోజు కూడా ఎక్కువగా ఉండడానికి వీలు లేకుండా చర్యలు చేపట్టింది. సాధారణంగా యూఏఈ 30, 60 రోజుల విజిట్ వీసాలను జారీ చేస్తుంటుంది. ఈ వీసాలపై యూఏఈకి వచ్చినవారు గడువు ముగిసిపోకముందే వెళ్లిపోవాల్సి ఉంటుంది. ఇకపై తమ దేశంలో ఒక్కరోజు ఎక్కువగా ఉన్నా నిషేధిత జాబితాలో చేరుస్తామని అక్కడి సర్కారు ప్రకటించింది. దీనివల్ల వీసా నిబంధనలు ఉల్లంఘించినవారు యూఏఈతో పాటు ఇతర గల్ఫ్ దేశాల్లో ప్రవేశానికి అనర్హులు అవుతారు. విజిట్ వీసాలపై వచ్చి యూఏఈలో చట్టవిరుద్ధంగా ఉంటున్నవారి సంఖ్యను తగ్గించుకోవడంతో పాటు ఎవరైనా చట్టబద్ధంగానే తమ దేశంలో ఉండే విధంగా యూఏఈ ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటోంది. యూఏఈలో ఉపాధి చూపిస్తామని.. తొలుత విజిట్ వీసాపై వెళ్లాక, తర్వాత వర్క్ వీసా ఇప్పిస్తామని చెప్పే ఏజెంట్ల మాటలను నిరుద్యోగులు నమ్మవద్దని గల్ఫ్ వలస కార్మిక సంఘాల ప్రతినిధులు సూచిస్తున్నారు.



క్యాజువాలిటీలో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దాస్పత్రిలో కలెక్టర్ అర్ధరాత్రి తనిఖీ

వైద్య సేవలపై ఆరా

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్ పీవీ గౌతమ్ శనివారం అర్ధరాత్రి 2 గంటలకు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన విధుల్లో చేరినప్పటి నుంచి ఈ ఆస్పత్రిపై ప్రత్యేక నిఘా పెట్టారు. తరచూ ఆకస్మిక తనిఖీలు చేపడుతూ వైద్యులు, సిబ్బంది సక్రమంగా పని చేసేలా చూస్తున్నారు. కలెక్టర్ ఏ సమయంలో వస్తారో తెలియక ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు. కలెక్టర్ తాజాగా శనివారం అర్ధరాత్రి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి ఆకస్మిక తనిఖీ చేశారు. మెటర్నిటీ లేబర్ రూమ్‌ను పరిశీలించారు. డాక్టర్, సిబ్బంది విధులపై ఆరా తీశారు. కాజువాలిటీ, ఐసీయూ గదులతో పాటు రిజిస్టర్లు పరిశీలించి డ్యూటీ డాక్టర్లు ఎంతమంది ఉన్నారని తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి ఎక్కువగా పేదలే వస్తుంటారని, మెరుగైన సేవలు అందించి వారికి నమ్మకం కల్పించాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రుల్లో సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చిస్తోందని, సిబ్బంది కూడా సక్రమంగా పని చేసి మానవతా దృక్పదంతో మెలగాలని చెప్పారు.

రామన్‌పాడులో 1,019 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం పూర్తిస్థాయి నీటి మట్టం 1,019 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 550 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా.. సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఇదిలా ఉండగా ప్రాజెక్టులోని ఎన్టీఆర్ కాల్వ ద్వారా 410 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం మరో 20 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

బొటానికల్ గార్డెన్ సందర్శన



జడ్చర్ల టౌన్: పట్టణంలోని తెలంగాణ బొటానికల్ గార్డెన్‌ను ఆదివారం వనపర్తి డబ్ల్యూసీసీఎం డిగ్రీ కళాశాల విద్యార్థులు 46 మంది సందర్శించారు. బొటానికల్ టూర్‌లో భాగంగా సందర్శనకు వచ్చిన విద్యార్థులకు గార్డెన్ సమన్వయకర్త సదాశివయ్య గార్డెన్ వివరాలను వారికి వివరించారు. గార్డెన్‌తోపాటు స్టేట్ హెర్బేరియం, బయోడైవర్సిటీ రీసెర్చ్‌ల్యాబ్ గురించి విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల వెంట అధ్యాపకులు ఆంజనేయులు, నర్సింహారెడ్డి, కరుణాకర్, సూర్యనారాయణ, పరిశోధక విద్యార్థులు రమాదేవి, రాహుల్, వీరాంజనేయులు తదితరులున్నారు.

దివ్యాంగులకు భరోసా



- వందశాతం సబ్సిడీపై ఉపకరణాలు
- పంపిణీకి అధికారుల కసరత్తు
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఈ నెల 25 వరకు గడువు

మహబూబ్‌నగర్ రూరల్: దివ్యాంగుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తాజాగా వందశాతం సబ్సిడీపై ఉపకరణాలు అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు అర్హుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తుంది. ఈ నెల 25లోగా దివ్యాంగులు ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. జిల్లా సంక్షేమ శాఖ అధికారులు దివ్యాంగుల అవసరాలకు అనుగుణంగా పరికరాలు, వాహనాలు, వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్లు, వీల్‌చైర్లు, ల్యాప్‌టాప్‌లు సిద్ధం చేస్తున్నారు.

రాయితీలా ఇలా..

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నెలనెలా దివ్యాంగులకు రూ.3,016 చొప్పున ఆసరా పింఛన్ ఇస్తోంది. డీఆర్‌డీఏ ద్వారా సబ్సిడీ రుణాలు ఇచ్చి స్వయం ఉపాధికి ప్రోత్సహిస్తుంది. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణానికి బస్‌పాస్‌లు, దివ్యాంగుల వివాహాలకు ప్రోత్సాహకాలు అందిస్తుంది. అలాగే వందశాతం రాయితీపై ఉపకరణాలనూ అందించనుంది.

జిల్లాకు ఇవీ..

తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ ద్వారా 2022- 23 సంవత్సరానికి గాను జిల్లాకు ఉచిత ఉపకరణాలు మంజూరు చేసింది. ఇందులో రెట్రోఫీటెడ్ మోటార్ వెహికిల్ (12), బ్యాటరీ వీల్‌చైర్స్ (9), 4జీ స్మార్ట్‌ఫోన్లు (15), ల్యాప్‌టాప్‌లు (6), డైసీ ప్లేయర్ (1), ట్రై సైకిళ్లు (22), వీల్‌చైర్స్ (3), చంక కర్రలు (42), వినికిడి యంత్రాలు (15), అంధుల చేతికర్రలు (17), అంధుల స్మార్ట్ కేన్ డివైసెస్ (4), టీఎంఎల్ కిట్స్ (9) చొప్పున పంపిణీ చేయనున్నారు.

దివ్యాంగులు https//tsobmms.cgg.gov.in పోర్టల్‌లో ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

వీరు అర్హులు..

75 శాతం కన్నా ఎక్కువ వైకల్యం ఉండి 18- 50 ఏళ్లలోపు వయస్సు ఉన్న దివ్యాంగులు వందశాతం రాయితీపై మోటార్ వెహికిల్ అందుకునేందుకు అర్హు లు. అదేవిధంగా వారు డిగ్రీ లేదా ఇంటర్మీడియట్ పూర్తి చేసి మూడేళ్ల కాలపరిమితి దాటి ఉండాలి.

దరఖాస్తు చేసుకోండి



తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపకరణాలు అందించనుంది. శారీరక వైకల్యంతోపాటు బధిరులు, మానసిక దివ్యాంగులు ఉపకరణాలు పొందేందుకు అర్హులు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారులకు ఉపకరణాలు పంపిణీ చేస్తాం. దివ్యాంగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అర్హులందరికీ ఉపకరణాలు అందుతాయి.

– జరీనాబేగం, మహిళా, శిశు, వికలాంగ, వయోవృద్ధుల సంక్షేమశాఖ జిల్లా అధికారి

డైసీ ప్లేయర్‌కు..

75 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న అంధత్వ వికలాంగులు డైసీ ప్లేయర్ తీసుకునేందుకు అర్హులు. వారు ఇంటర్మీడియట్ పూర్తి చేసి 15 ఏళ్లు నిండిన వారై ఉండాలి.

ల్యాప్‌టాప్‌లకు..

75 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉండి 18- 50 ఏళ్లలోపు ఉన్నవారు ల్యాప్‌టాప్ తీసుకునేందుకు అర్హులు. వారు డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. 40 శాతం వైకల్యం ఉండి పీహెచ్‌డీ పూర్తి చేసిన దివ్యాంగులూ దీనికి అర్హులే.

బ్యాటరీ వీల్‌చైర్‌కు..

40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉండి కండరాలు, కీళ్ల బలహీనత, వెన్నుపూస విరిగిన వారు అర్హులు. వారి వయస్సు 12 ఏళ్లు దాటి ఉండాలి.

స్మార్ట్ ఫోన్లకు..

51 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉండి బధిర దివ్యాంగులు 4జీ స్మార్ట్ ఫోన్లు తీసుకునేందుకు అర్హులు. వీరి వయస్సు 16- 50 లోపువారు, ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఉండాలి.

ప్రధాని మెచ్చిన 'కోడుపర్తి'



గ్రామంలోని ఆరోగ్య కార్యక్రమాల్లో అధికారులు

- పల్లె దవాఖానా ఆరోగ్య సేవలపై ట్విట్టర్‌లో ప్రశంస
- ఆరోగ్య మేళా, గర్భిణుల సంరక్షణ, పోషకాహారంపై వైద్య సిబ్బంది నిత్యం అవగాహన



వెరీగుడ్ అంటూ ప్రశంసించిన ప్రధాని మోదీ ట్వీట్

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలం కోడుపర్తి పల్లె దవాఖానా సిబ్బంది సేవలను ప్రధాని మోడీ ప్రశంసించారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్స్ అనే ఆరోగ్య విభాగానికి తమ రోజు వారి సేవా కార్యక్రమాలను పోస్ట్ చేయగా.. ట్విట్టర్‌లో వీటిని గమనించిన ప్రధాని నరేంద్ర మోడీ వారిని వెరీగుడ్ అంటూ అభినందించారు. పూర్తి వివరాలిలా.. జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ పథకంలో భాగంగా చేపడుతున్న సేవలను కోడుపర్తి పల్లె దవాఖానా వైద్య సిబ్బంది ట్విటర్ వేదికగా జాతీయ ఆరోగ్య సంస్థలకు నిత్యం పోస్టు చేస్తారు. అయితే, ఫిబ్రవరి 17న సైతం పోస్టు చేశారు. ఇందులో కోడుపర్తి గ్రామంలో ఆరోగ్య మేళా కార్యక్రమాలు, గర్భిణుల సంరక్షణ, పోషకాహారం వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించిన వివరాలు పొందుపర్చారు. ఇలాంటి కార్యక్రమాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సామాజిక మాధ్యమాల్లో రోజువారి వివరాలను తెలుపుతున్నారు. కింది స్థాయి అధికారుల నుంచి జాతీయ స్థాయిలో తమ కార్యక్రమాలను ట్యాగ్ చేస్తారు. ఇలా కోడుపర్తికి చెందిన వైద్య సిబ్బంది సేవలను గమనించిన ప్రధాని ప్రశంసించారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో వారు కూడా కోడుపర్తి కి చెందిన వైద్య సిబ్బందిని అభినందించారు.

మెరుగైన వైద్యసేవలు..



పల్లె దవాఖానాకు వచ్చిన ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలందించాం. వాతావరణ మార్పులపై నిత్యం అప్రమత్తం చేశాం. డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్, పీహెచ్‌సీ వైద్యాధికారి స్వప్న ఆదేశాల మేరకు రోగులకు అందుబాటులో ఉన్నాం. దీంతోనే గ్రామంలోని ప్రజలు కూడా 80శాతం వరకు ప్రైవేటు నుంచి ప్రభుత్వ ఆరోగ్య సేవలవైపే మొగ్గుచూపుతున్నారు. అందరి కృషితోనే ఈ ప్రశంసలు పొందాం.

– డా.రవినాయక్, సీహెచ్‌వో


జాతీయ అవార్డులకు పోటీ పడ్డాం



ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించి వైద్యశాఖతో కలిసి పని చేశాం. గ్రామంలో మురుగు, పారిశుద్ధ్యం, దోమలు, ఈగల నివారణ వంటి వాటిపై వైద్య సిబ్బందితో కలిసి పని చేయడంతో దీన్ దయాల్ ఉపాధ్యాయ్ గ్రామీణ పురస్కార్ జాతీయ అవార్డుకు పోటీ పడ్డాం. అంతలోనే ప్రధాని మోడీ నుంచి అభినందన రావడం మరింత ఆనందాన్నిచ్చింది.

– హంసలేఖ, పంచాయతీ కార్యదర్శి, కోడుపర్తి

ప్రజల సహకారంతోనే..



పారిశుద్ధ్యం, ఆరోగ్యంపై అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించగా.. ప్రజలు సైతం సహకరించడం వల్లే ప్రధాని నుంచి ఈ ప్రశంస వచ్చింది. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాల్లో ప్రజలు భాగస్వాములు కావడంతో పాటు, మెరుగైన వైద్యం అందుతుండడంతో నమ్మకం కలిగింది.

– ఉమాదేవి, సర్పంచ్, కోడుపర్తి

ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్‌దే..

కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 14 స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులే గెలుస్తారని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని 4వ వార్డులో మున్సిపల్ పార్క్ నిర్మాణానికి భూమిపూజ చేసి అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. గత ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీ గెలిచిన 13 సీట్లలో ఈసారి బీఆర్‌ఎస్ వ్యతిరేకులు గెలుస్తారని మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. ఓట్లేసిన ప్రజలను ఏనాడు పట్టించుకోకపోవడంతోనే కొల్లాపూర్‌లో జూపల్లిని ఓడించారన్నారు. నియోజకవర్గంలో 18 ఏళ్లలో ఏం అభివృద్ధి చేశావో చెప్పాలని ప్రశ్నించారు. ఆధారాలు లేని విమర్శలతో ప్రజలను తప్పుదోవ పట్టించడమే పనిగా పెట్టుకున్నారని.. తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని తెలిపారు. ధైర్యం ఉంటే అన్ని అంశాలపై చర్చకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేగా గెలిచాక రెండేళ్లు కరోనా ఉందని.. మిగిలిన రెండున్నర ఏళ్లలో సోమశిల వంతెన, జాతీయ రహదారి, డయాలసిస్ సెంటర్, హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల తీసుకొచ్చినట్లు వివరించారు. మంత్రి కేటీఆర్ సహకారంతో కొల్లాపూర్ పురపాలికను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి